క్లుప్తంగా

నేటి నుంచి కాల గంగమ్మ తిరునాల

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని ఒంటిమిట్ట చెరువు కట్టపై వెలసిన కాల గంగమ్మ తిరునాల శనివారం, ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరునాల సందర్భంగా శనివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం అనంతరం బండలాగుడు పోటీలు జరుగుతాయన్నారు. అలానే రాత్రి చెక్కభజన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఆదివారం మహిళలు బోనాలు సమర్పించి బలుల రూపంలో మొక్కులను తీర్చుకుంటారని పేర్కొన్నారు.

రేపు ఉచిత హోమియో వైద్య శిబిరం

రాజంపేట టౌన్ : పట్టణంలోని అమ్మవారిశాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఆర్యవైశ్య అఫిషియల్స్, ప్రొఫెషినల్స్ (ఆవోపా) రాజంపేటశాఖ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతికి చెందిన ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ సుప్రియ రోగులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈవైద్య శిబిరంలో థైరాయిడ్, ఒబిసిటీ, స్త్రీలు, తల్లిపిల్లల సమస్యలు, కీళ్లనొప్పులు, వెన్నుపూస తదితర సమస్యలకు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. శిబిరంలో వైద్యసేవలు పొందాలనుకునేవారు శనివారం సాయంత్రంలోపు 85228 05006, 94901 33437 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

రేపు ఉచిత ఖత్నా

చిన్నమండెం : మండల కేంద్రంలోని సంతబజారులో ఉచితంగా ఖత్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు షేక్ షఫీవుల్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు డా.అబ్దుల్ రజాక్, డా.జాకీర్ బాషాలచే ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మహబూబ్ స్టోన్ క్రషర్ ప్రొప్రేటర్ షఫీవుల్లా తెలిపారు. ఈ అవకాశాన్ని ముస్లిం సోదరులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఖత్నా చేసుకున్న పిల్లలందరికీ ఉచితంగా మందులు, గోధుమపిండి, నెయ్యి, బెల్లం, రాగిపిండి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

వీఆర్ఓపై దాడి కారకులను అరెస్ట్ చేయాలి

రాయచోటి అర్బన్/గాలివీడు : గాలివీడు మండలం పందికుంట వీఆర్ఓ జయన్నపై దాడిచేసిన వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సీ కులానికి చెందిన జయన్నపై విధి నిర్వహణలో ఉండగా జయన్నను కులంపేరుతో దూషించడమే కాక దాడి చేసిన వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి జైలుకు పంపాలన్నారు. గతంలో దళితుడుడైన గాలి వీడు ఎంపీడీఓ పైన దాడి జరిగిందని, నేడు వీఆర్ఓ జయన్నపైన దాడి జరగడం దురదృష్టకరమన్నారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దాడులకు పాల్పడుతున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో కఠినమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలంటూ కోరారు.

సత్కారం




కార్మికులను సన్మానిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట : మున్సిపాలిటీలో పారిశుద్ధ్య విభాగంలో అవుట్‌సోర్సింగ్ పనిచేస్తూ పదవీ విరమణ పొందిన కార్మికులు కొండయ్య, సీతమ్మ, విజయమ్మలను శుక్రవారం ఘనంగా సన్మానించారు. వీరికి మున్సిపల్ కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనవన్నారు. వారి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఈ ఈశ్వరరెడ్డి, మేనేజరు సూర్యమోహన్, టీపీఓ రెహమాన్, సీఐటీయూ నేత చిట్వేలి రవి, పీవీ రమణ, లక్ష్మీదేవి, ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ లోన్లు

పెనగలూరు : మండలంలో ఎస్సీ, ఎస్టీలకు 31 సబ్సిడీ లోన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ విజయారావు తెలిపారు. పెనగలూరు స్టేట్ బ్యాంకుకు 12, పెనగలూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుకు 10, ఓబిలి స్టేట్ బ్యాంకుకు నాలుగు, పొందలూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు 5 సబ్సిడీ లోన్లు మంజూరునకు అంగీకరించినట్టు చెప్పారు. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని వారు కోరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



దర్శనమిస్తున్న శ్రీ రాజరాజేశ్వరీదేవి

సంబేపల్లి : మండల పరిధిలోని మోటకట్లలో నూతనంగా నిర్మించిన శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి శక్తిపీఠంతో పాటు అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అపురూపం.. మందగిరి క్షేత్రం

- నేడు ఆలయంలో త్రయోదశి పూజలు
- అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ



మందగిరి శనీశ్వరస్వామి ఆలయం (ఇన్‌సెట్‌లో) శనీశ్వర స్వామి మూలవిరాట్

సిద్దవటం : అరుదైన అపురూప ఆలయం మందగిరి శనీశ్వర స్వామి క్షేత్రం. కడప – రాజంపేట మార్గంలో వెలసిన ఈ క్షేత్రం బాధితుల పాలిట కొంగు బంగారంగా వెలుగొందుతోంది. ప్రతి వ్యక్తి జీవితంలో ఒకసారైనా శనీశ్వరుని దండానికి గురికాకుండా ఉండరు. ప్రారబ్ధ కర్మలు మానవుని జీవితాన్ని శాసిస్తాయి. కర్మకు తగిన శిక్ష తప్పదు. ఆ ధండనాధికారే శనీశ్వరుడు. ప్రారబ్ధ కర్మలు పట్టి పీడిస్తే కోటీశ్వరుడైనా బికారిగా మారి బట్టలు చించుకొని తిరగాల్సిందే. అలాంటి ప్రారబ్ధ జాతకంలో శని మహర్దశ, అర్ధాష్టమ శని లాంటి పనులు దశలు సంభవిస్తాయి. అయితే హైందవ ధర్మంలో ఈ సమస్యకు పలు రకాల ఉపశాంతులు కూడా గోచరిస్తాయి. శని మహర్దశ నడుస్తున్న వ్యక్తి లేదా జాతకంలో శని ప్రభావం ఉన్న ఏ వ్యక్తి అయినా శనిని శాంతింపజేయాల్సిందే. అందుకు ఒక అపురూప క్షేత్రంలో శనీశ్వర పూజ శాంతి తప్పనిసరి. అలాంటి అపురూప క్షేత్రమే ఇది. మహిమాన్వితుడు, దేవ వంద్యుడైన శనీశ్వరుడు ఇక్కడ ప్రధాన దైవం. చరిత్రను సైతం పరిశీలిస్తే అలనాటి రామాయణంలో మహా భక్తుడైన రావణాసురుడు దుర్మార్గుడై చరిస్తే శని ప్రభావితుడై పతనమయ్యాడు. మహా ధర్మపరుడైన నల చక్రవర్తి రాజ్య భ్రష్టుడై శని ప్రభావంతో బికారిగా మారాడు. హరిశ్చంద్ర చక్రవర్తి సైతం ఈ కోవలోని వాడే సాక్షాత్తు దేవ గురువు బృహస్పతి కూడా తన జీవితంలో శని మహర్దశ రానుందని తెలిసి శని దండనకు భయపడి శనిని ఆయన ఇంటికి వెళ్లి ప్రార్థించి తనపై ఆయన సంపూర్ణ ప్రభావాన్ని చూపకుండా రక్షించమని వేడుకుంటే గురు దేవుని మాట కాదనలేని శనీశ్వరుడు బృహస్పతి జీవితంలో తన దశ ఎన్ని సంవత్సరాలు ఉంటే ఆ సంవత్సరాలను గడియలుగా మార్చి ప్రభావం చూపుతానని ఇంతకన్నా తానేమీ చేయలేనని సహృదయంతో అభయమిస్తాడు. అందుకు సామాన్యులమైన మనం శనీశ్వర శాంతికి కృషి చేయాల్సిందే.

మందగిరి ప్రాంతంలో 400 సంవత్సరాల క్రితం ఇదే ప్రాంతంలో పురాతన దేవాలయం ఉండేదని అయితే అది కొండ ప్రవాహాలతో కాలగర్భంలో కలిసి పోయిందని అదేచోట 24 సంవత్సరాల కిందట నూతన ఆలయం నిర్మించబడిందని ఏపీ టూరిజం శాఖ తెలియజేస్తుంది. 17వ శతాబ్దంలో నిర్మించబడిన స్వామి బావి ఇక్కడ ఉందని ఆశాఖ తెలియజేస్తోంది. ఈ దేవాలయం నిర్మాణ విషయానికి వస్తే 24 సంవత్సరాల కిందట సిద్దవటం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం అనే బ్రాహ్మణ కుటుంబం అత్యంత భక్తి శ్రద్ధలతో శనీశ్వర స్వామి ఆలయం నిర్మాణం గావించింది. స్వామి వారిని ప్రతిష్ఠించిన నాటి నుంచి స్వామి మహత్యం దశదిశలలో వ్యాపించింది. ప్రతి శని త్రయోదశికి వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకొని నువ్వుల నూనెతో అభిషేకించి తమను అనుగ్రహించి శని నుంచి విముక్తులను చేయమని వేడుకుంటారు. ఈ దేవాలయానికి సమీపంలో ఉన్న విఘ్నేశ్వర, ఆంజనేయ స్వామి, శివాలయాలు భక్తుల పూజలందుకుంటున్నాయి. శనీశ్వర దేవాలయానికి జిల్లా నలుమూలల నుంచే గాక ఇతర జిల్లాల నుంచి సైతం భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతున్న ఈ ఆలయం వద్ద కల్యాణ మండపం, టూరిస్టు రెస్టు రూమ్ నిర్మాణాలు చేపడుతున్నారు. పలు రకాలైన ఫల, పుష్ప వృక్షాలు భక్తులకు సేదనిస్తాయి. ఈ దేవాలయాన్ని ఒకసారి దర్శిస్తే స్వామి మహత్యం అవగతమవుతుంది. కాగా శనివారం (నేడు) శని త్రయోదశి ఉండటంతో ఆలయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

కూటమి పాలనలో ప్రజలు తల్లడిల్లుతున్నారు



మాట్లాడుతున్న శిబ్యాల విజయభాస్కర్

రాయచోటి అర్బన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అపేశారని, మద్యం అమ్మకాలు మాత్రం ఫుల్‌గా సాగిస్తూ తాగుబోతుల జేబులకు చిల్లుపెడుతున్నారని వైఎస్ఆర్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ విమర్శించారు. శుక్రవారం వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అమలుచేసిన పక్కాగృహాల నిర్మాణం, అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, రైతుభరోసా, రైతులకు ఆర్థికసహాయం, ఫీజు రీయింబర్స్‌మెంట్, కులవృత్తులు, తోపుడుబండ్ల వారికి ఆర్థికసహాయం తదితర సంక్షేమ పథకాలను కూటమి పాలనలో పూర్తిస్థాయిలో ఆపివేశారన్నారు. పేదలకు ఉపాధి పనులు లేక, అప్పులు దొరకక తల్లడిల్లుతుంటే కూటమి ప్రభుత్వం, సంక్షేమం పేరిట అందించే సహాయం కూడా ఆపేయడంతో పేదల బతుకులు అల్లకల్లోలంగా మారాయన్నారు. పేదలకు ఉపాధిని కల్పించడం చేతకాని ప్రభుత్వం ఏదో ఒక అంశాన్ని తెరపైకి తెచ్చి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాయన్నారు. రాబోయే ప్రజలు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజలు కూటమి పార్టీలను రాష్ట్రం నుంచి తరిమికొడతారంటూ ఎద్దేవా చేశారు. సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ నేతలు శివశంకర్, సంజీవ, బుజ్జిబాబు, సుధాకర్‌లు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

సుండుపల్లె : మండల కేంద్రం పరిధిలోని నివాసగృహాలు, వ్యాపార సముదాయాలను నిర్మించుకుంటున్న వారు అనుమతులకు దళారులను నమ్మి మోసపోవద్దని పంచాయతీ కార్యదర్శి రామరాజు రామచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ నుంచి అనుమతులను కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే పొందాలన్నారు. కొందరు దళారులు పాత తేదీలు వేసి బ్లూప్రింట్ ద్వారా ఆఫ్‌లైన్‌లో అనుమతులు ఇప్పిస్తున్నారని అలాంటి వాటిని నమ్మవద్దని తెలియజేశారు.

జూదరుల అరెస్టు

నందలూరు : మండలంలోని ఆడపూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మర్రిపల్లి పొలాల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్ఐ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి ఆయన మాట్లాడుతూ తనకు వచ్చిన సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి దాడి చేయగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి ఆరు మొబైల్స్, రెండు స్కూటీలు, రూ.15,300లు నగదును స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

పరిశుభ్రత పాటింపుతోనే మలేరియా నివారణ



సుండుపల్లె: మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య అధికారులు, సిబ్బంది

సిద్దవటం/నందలూరు/సుండుపల్లె : పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ మలేరియా వ్యాధి రాకుండా జాగ్రత్త పడుదామని డిప్యూటీ డీహెచ్ఎంఓ డాక్టర్ శేఖర్, సిద్దవటం సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాష్, రాయవరం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ రుబీనాలు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగహనా సదస్సు, ర్యాలీలు నిర్వహించారు. మంచినీటిలో పెరిగే ఆడ అనాఫిలస్ అనే దోమకాటు ద్వారా మలేరియా వస్తుందన్నారు. మలేరియా వ్యాధి వైవాక్స్, ఫాల్సీఫరం అనే రెండు రకాలుగా ఉంటుందని, ఈ వ్యాధి వచ్చిన వారికి చలి, జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, వణుకు వంటి లక్షణాలు ఉంటాయని తెలియజేశారు. పరిశుభ్రతను పాటిస్తూ దోమతెరలు వాడాలని సూచించారు. అనంతరం ఆయా మండల కేంద్రాల్లో వైద్య సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో సిద్దవటం వైద్యులు డాక్టర్ సాయివర ప్రసాద్, దీపక్, లక్ష్మీకర్, హరిహరన్, శివాణి, నందలూరు మండలంలో డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ కార్తిక్ విశ్వనాథ్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ దాస్, టిబి సూపర్ వైజర్ జయప్రకాష్, ఎంపీహెచ్ఈఓ వీర నారాయణ, సీహెచ్‌ఓలు, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహాభారత యజ్ఞం



హరికథ చెప్తున్న భాగవతారిణి సీతామహాలక్ష్మీ

వీరబల్లి : మండలంలో మట్లి పంచాయతీలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయం వద్ద జరుగుతున్న మహాభారత యజ్ఞం శుక్రవారంతో ఏడవ రోజుకు చేరుకుంది. ఈ మహాభారత యజ్ఞంలో పగటిపూట భక్తుల కోసం హరికథ భాగవతారిణి సీతామహాలక్ష్మీ అరణ్య పర్వం, కీచక వధను వివరించారు. శనివారం అర్జునుడి తపస్సు, మాను ఎక్కే కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణ వేడుకను జరుపుతున్న వేదపండితులు

పెనగలూరు : మండల కేంద్రం పరిధి కొత్తపల్లిలో శుక్రవారం రాత్రి శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు కల్యాణాన్ని తిలకించారు. బిఎల్ నరసింహారెడ్డి, సుమతమ్మ దంపతులు కల్యాణ వేడుకకు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను మేళతాళాలతో దేవాలయానికి తీసుకువచ్చారు. కల్యాణం అనంతరం వచ్చిన భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు. గ్రామ పురోహితులు చెంచు సుబ్బనరసయ్య ఆధ్వర్యంలో వేదపండితులు కల్యాణ క్రతువును జరిపించారు.

జడ్జిలకు సన్మానం



జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు

నందలూరు : బదిలీపై ధర్మవరానికి వెళుతున్న జూనియర్ సివిల్ జడ్జి నందిని, ప్రస్తుతం ఇన్‌చార్జ్ సివిల్ జడ్జిగా నియమితులైన భార్గవిలను బార్ అసోసియేషన్ అధ్యక్షులు దాసరి నరసింహులు అధ్యక్షతన ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జడ్జి నందిని చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

ఉపాధి హామీ పనులు తనిఖీ

సిద్దవటం : ఉప్పరపల్లె, మాధవరం–1 గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు ఏపీఓ నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కూలీల నమోదును పరిశీలించారు. కూలీలకు జనవరి నెల నుంచి మార్చి నెల వరకు నగదు చెల్లించామన్నారు.

అవినీతిపరులను ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వం

- మండలంలోని ఉపాధి హామీ పనుల్లో భారీ గోల్‌మాల్
- అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసిన ఎంపీపీ బాబుల్‌రెడ్డి



అధికారుల తీరును ప్రశ్నిస్తున్న ఎంపీపీ బాబుల్‌రెడ్డి

పుల్లంపేట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవినీతిపరులను ప్రోత్సహిస్తోందని పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భారీ గోల్‌మాల్ జరుగుతోందని, రూ. 20 లక్షలు మేర ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అయ్యిందన్నారు. తిప్పాయిపల్లి గ్రామానికి చెందిన ఓ ముద్దాయిని కోర్టుకు హాజరుపరిస్తే అతనికి ఉపాధి హామీ కూలీ మస్టర్‌లో వేశారన్నారు. పుల్లంపేట మండల వ్యాప్తంగా 22 పంచాయతీలలో 3290 మంది ప్రతిరోజూ ఉపాధిహామీ పనికి వెళ్తున్నారని, ఒక వత్తలూరు పంచాయతీలో వెయ్యి మంది కూలీలు ఉన్నారని, ఈ పంచాయతీలో ఏ స్థాయిలో అవినీతి జరుగుతోందో తెలుస్తోందన్నారు. వత్తలూరు పంచాయతీలో అనర్హులకు ఉపాధిహామీలో మస్టర్‌లు వేసి నిధులు స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. మల్లెంవారిపల్లి, ఈడిగపల్లి, తిరుమలయ్యగారిపల్లి గ్రామాలలో సుమారు రూ. 20 లక్షలు ఉపాధిహామీ నిధులు స్వాహా చేసినట్లు సమాచారం ఉందన్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు సర్పంచ్‌ల అనుమతి లేకుండా వారి ఇష్టానుసారం వ్యవహరిస్తుండటాన్ని ప్రశ్నించారు. పుల్లంపేట తహసీల్దార్ విధులు చేపట్టి తొమ్మిది నెలలు అయినప్పటికీ ఇంతవరకు మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాకపోవడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. అనంతసముద్రం గ్రామంలో ముగ్గురు అన్నదమ్ముల భూములు సర్వే చేసి భూమిని అప్పజెప్పాలని అనేకసార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. అలాగే వంద సంవత్సరాల వయస్సు ఉన్న చింతచెట్టును పెట్రోల్ పోసి కాల్చివేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. అలాగే పుల్లంపేట మండల వ్యాప్తంగా బెల్టు షాపులు అధికంగా ఉన్నాయని, దీంతో గ్రామాలలో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయన్నారు. మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జయశంకర్ నాయుడు, బోగా వెంకటరత్నమ్మ, ఎంపీడీఓ వరప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

టెన్త్‌లో గురుకులం విద్యార్థుల సత్తా



అమృత (516)



యమున (545)



దాక్షాయిని (500)

వీరబల్లి : మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇటీవల జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఆ పాఠశాలలో చదివిన యమున 548 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలవగా, అమృత 516, దాక్షాయిని 500 మార్కులతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. అలానే పాఠశాల నుంచి 36 మంది పరీక్షలు రాయగా 35 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ఎస్ఓ సాయి దివ్య తెలిపారు. అద్భుత ఫలితాలతో రాణిస్తున్న పాఠశాలలో విద్యార్థులను తల్లిదండ్రులు చేర్పించాలని ఆమె కోరారు. బాలికలకు పాఠశాలలో ఉత్తమ విద్యతో పాటు క్రమశిక్షణను అందిస్తామని తెలియజేశారు.

రాణించిన రమ్య



రమ్యసాయి (590)

పుల్లంపేట : పుల్లంపేట మండలం వత్తలూరు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ మూరె శంకర్‌రెడ్డి కుమార్తె రమ్యసాయి ఇటీవల విడుదలైన పది పరీక్షా ఫలితాలలో 590 మార్కులు సాధించింది. రాజు విద్యాసంస్థలో చదువుతున్న రమ్య ఐఏఎస్ కావాలనేది తమ లక్ష్యమని తెలియజేసింది.

శభాష్ లాస్య



తల్లి కవితతో లాస్య(592)

రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారిపల్లెకు చెందిన కవిత, వెంకట శివయ్యల కుమార్తె లాస్య పదవ తరగతిలో 592 మార్కులు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నిలబెట్టింది. తమ ఇద్దరు ఆడబిడ్డలను బాగా చదివించుకోవాలని ఆశయంతో మండలంలోని కసిరెడ్డిగారిపల్లెకు చెందిన వెంకటశివయ్య కడపలో ఫోటో స్టూడియో పెట్టుకొని స్థిరపడ్డారు. శివయ్య కరోనా సమయంలో మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి కవిత పిల్లలను చదివిస్తోంది. లాస్యను 6వ తరగతిలో బాలవికాస్ హైస్కూల్‌లో చేర్పించగా అనివార్య కారణాలతో 10వ తరగతిలో నాలుగు మాసాలు పాఠశాలకు వెళ్లకుండా ఇంటివద్దనే సాయిగణేష్ ఉపాధ్యాయుడి వద్ద ట్యూషన్‌కు వెళ్తూ పదవ తరగతి పరీక్షలు రాసి 592 మార్కులు సాధించి అందరి చేత శభాష్ అనిపించుకుంటోంది. తండ్రి లేకపోయినప్పటికి తల్లి కష్టపడి చదివించిందని కసిరెడ్డిగారిపల్లె గ్రామస్తులు తల్లి, కుమార్తెలను అభినందించారు.

స్పందన నామమాత్రం.. పట్టని ప్రజారోగ్యం



9వ వార్డులో ఇళ్ల మధ్య ఉన్న చెత్త కుప్పను తొలగించి బ్లీచింగ్ చల్లిన దృశ్యం



పట్టణంలోని అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ సమీపంలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో మున్సిపల్ అధికారులు మొద్దు నిద్రను వీడటం లేదు. శుక్రవారం సాక్షి దినపత్రిలో రాయచోటి మున్సిపాల్టీ పరిధిలో పారుతున్న నిర్లక్ష్యం.. పడకేసిన పారిశుధ్యంపై ప్రచురితమైన కథనంపై మున్సిపల్ శాఖ అధికారులు నామమాత్రపు స్పందనతో సరిపెట్టుకున్నారు. 9వ వార్డులో ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్త కుప్పలలో ఒకటి, రెండు తొలగించి చేతులు దులుపుకున్నారు. మురుగు కాలువలలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని మాత్రం పట్టించుకోలేదు.

పురవీధులలో పర్యటించిన డీఎంఓ

రాయచోటి పట్టణంలో పేరుకుపోయిన చెత్త కుప్పలు దుర్గంధ భరితంగా ఉన్న మురుగునీటి కాలువలను శుక్రవారం జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, సబ్ యూనిట్ అధికారి జయరాములు పరిశీలించారు. వీధులలో ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయిన చెత్త, రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరున చూసి మున్సిపల్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై డీఎంఓ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.

సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

సిద్దవటం : విత్తన శుద్ధితో పాటు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కడప ఊటుకూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.అంకయ్యకుమార్, బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజులు తెలిపారు. సిద్దవటం మండలంలోని టక్కోలు రైతు సేవా కేంద్రం నూనె గింజల అభివృద్ధి పథకం, జాతీయ ఆహార భద్రత మిషన్ చిరుధాన్యాలు, పప్పుదినుసులు, నూనె గింజల పంటల సాగు, యాజమాన్యం తదితర అంశాలపై శుక్రవారం రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకం కింద 50 శాతం సబ్సిడీపై వివిధ రకాల పురుగు, తెగుళ్ల మందులు అవసరమైన రైతుకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అలానే పంట సాగు నుంచి కోత వరకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో ఏఓ రమేష్ రెడ్డి, కడప రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి నాగభూషన్‌రెడ్డి, జిల్లా ఎవాల్యుయేటర్ ఆకుల వంశీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆర్ఏడబ్ల్యూఈపీ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అణచివేయాలి

పహల్గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ అన్ని వర్గాల ప్రజలు నిరసన ర్యాలీలు తీస్తున్నారు. శుక్రవారం రామాపురం మండల కేంద్రంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో, సుండుపల్లెలో మైనార్టీ నాయకులు, రాజంపేటలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో, రైల్వేకోడూరులో హిందూ, ముస్లిం సంఘాలు వేర్వేరుగా నిరసన, మానవహార, కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 28 మంది పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చిచంపడం అమానవీయ చర్య అని తెలిపారు. ఈ సంఘటనపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. దేశ సమగ్రతను విచ్ఛిన్నం చేయడానికి ఉగ్రవాదులు యత్నిస్తున్నారని, దేశమంతా ఒక్కటై ఉక్కుపిడికిలితో ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలన్నారు.

– సాక్షి,నెట్‌వర్క్



రామాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు



లక్కిరెడ్డిపల్లి: వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ



రైల్వేకోడూరు అర్బన్: పాకిస్తాన్ జెండా ప్రతులను దహనం చేస్తున్న హిందూ సంఘాలు



సిద్దవటం: మాధవరం-1లో జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



సుండుపల్లె: నిరసన వ్యక్తం చేస్తున్న మైనార్టీ నాయకులు



రాజంపేట: పాత బస్టాండులో రాజకీయ పార్టీ నాయకుల మానవహారం

పోస్టల్ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌పీఏడీ

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని పోస్టాఫీసును కర్నూలు రీజియన్ పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఆర్‌పీఏడీ) బిపి వెంకటరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు పోస్టాఫీసులో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోస్టల్ ద్వారా ప్రజలకు అందించే సేవలను ప్రజలకు తెలియజేయాలని, ఇందులో పొదుపు ఖాతా, బీమాకు సంబంధించిన అన్ని సేవలను ప్రజలకు తెలియజేసి విస్తృతంగా ప్రచారం కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పోస్టల్ ఏఎస్పీ శ్రీరామ శంకర్, ఇన్‌స్పెక్టర్ జయకృష్ణ, ఓబులవారిపల్లి తపాలా శాఖ సిబ్బంది శ్రీనివాసులు, నూకనపల్లి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.